క్లుప్తంగా

'ధర్నా విజయవంతం చేయండి'

సిర్పూర్(టి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ధర్నా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఐడీఎస్ కార్యాలయం ఆవరణలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉమా, సాహెరాబేగం, కుమారి, అర్చన, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత


సమ్మె నోటీస్ అందజేస్తున్న ఉద్యోగులు

లింగాపూర్: మండల కేంద్రంలో సర్వశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టనున్నారు. ఈమేరకు శనివారం ఎమ్మార్సీ భవనంలోని ఎంఈవో శ్రీనివాస్‌కు సమ్మె నోటీసు అందజేశారు. సీఆర్పీ జాదవ్ సంజీవ్‌కుమార్, రాథోడ్ సుమన్‌బాయి, గోదావరి, జ్యోతి, రంబాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

బెజ్జూర్: మండల నూతన ఎస్సై ఆర్.ప్రవీణ్‌కుమార్‌ను శనివారం మండల కాంగ్రెస్, బీజేపీ నాయకులు వేర్వేరుగా సన్మానించారు. గత రెండు రోజుల క్రితం బెజ్జూర్ ఎస్సైగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్సైని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

'ఆరోగ్యం క్షీణించడానికి అధికారులే కారణం'


నిమ్స్‌లో శైలజ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న దినకర్, శ్రీనివాస్

వాంకిడి: వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ ఆరోగ్యం క్షీణించడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీపీజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శైలజ పరిస్థితిని శనివారం పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులను కలిసి పరామర్శించారు. నిమ్స్ ఆసుపత్రిలో గత 15 రోజుల నుంచి చికిత్స అందిస్తున్న శైలజ ఆరోగ్యంలో ఎలాంటి మార్పు రాలేదని, దీనిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

సంఘ సమావేశాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ప్రధాన్ సంఘం నాయకులు

వాంకిడి: జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నేడు 'రాష్ట్రీయ హీరా సుక్క ప్రధాన్ ఉద్దాన్ సంఘటన్' సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం డివిజన్ నాయకులు పెందుర్ ధర్మ, గేడం సుభాష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేడు నిర్వహించే సమావేశంలో జిల్లా, మండల నూతన కమిటీలను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల నాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రధాన్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాగ్రత్తగా ఉండాలి

నార్నూర్: వసతిగృహాల్లోని విద్యార్థులు చలికాలం జాగ్రత్తగా ఉండాలని, వేడినీళ్లతో స్నానం చేయాలని తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో జవహర్ అన్నారు. ఈసందర్భంగా శనివారం మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం బాగుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్‌దేనని అన్నారు.

భయపెడుతున్న చలి




కెరమెరిని కప్పిన మంచు దుప్పటి


కెరమెరిలో అమ్మకానికి సిద్ధంగా స్వెటర్లు


ఇళ్లపై కురుస్తున్న మంచు

జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. తీవ్రమైన పొగమంచు కారణంగా ఉదయంవేళ రోడ్లపైకి వచ్చే వాహనాలు లైట్లు వేసి రాక తప్పడం లేదు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు మార్కెట్లలో లభించే స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్లు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. - కెరమెరి

నిర్మించారు.. వదిలేశారు..!

- తడి, పొడి చెత్త సేకరణలో కానరాని చిత్తశుద్ధి
- సెగ్రిగేషన్ షెడ్లలో ప్రశ్నార్థకంగా సేంద్రియ ఎరువుల తయారీ
- రూ.లక్షలు వెచ్చించినా నిర్వహణ లేక వృథా
- పట్టించుకోని అధికారులు


పెద్దసిద్దాపూర్‌లోని సెగ్రిగేషన్ షెడ్ వద్ద చెత్త వేస్తున్న సిబ్బంది (ఫైల్)


సేకరించిన చెత్తను తరలిస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

బెజ్జూర్: పంచాయతీల్లో తడి, పొడి చెత్తను సేకరించి సేంద్రియ ఎరువు తయారు చేసేలా ప్రభుత్వం వర్మీ కంపోస్టు షెడ్ల నిర్మాణం చేపట్టింది. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో వీటిని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యం ఘనంగా ఉన్నా.. ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి కరువైంది. ఈ కేంద్రాల్లో ఎరువుల తయారీ ప్రశ్నార్థకంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి షెడ్లు నిర్మించినా నిరుపయోగంగానే మారాయి. చెత్తను సేకరించి షెడ్లలో పడేస్తుండడంతో డంపింగ్ యార్డులా తలపిస్తున్నాయి.

22 గ్రామపంచాయతీలు..

బెజ్జూర్ మండలంలో 22 పంచాయతీలు ఉన్నాయి. ఏ ఒక్క పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్లను వినియోగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ఇళ్ల నుంచి సేకరించిన పొడిచెత్తలోని కాగితాలు, అట్టముక్కలు, గాజు సీసాలు, ఇనుప వ్యర్థాలను వేరుచేసి, తడి చెత్తను ప్రత్యేక పద్ధతిలో నిల్వ చేసి కంపోస్టు ఎరువుగా మార్చాలి. వీటిని విక్రయించడం ద్వారా వచ్చే నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించాలని ప్రభుత్వం దిశానిర్దేశం చేసినా క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. ఇప్పటికీ గ్రామాల్లో రోడ్ల పక్కన, జనావాసాల మధ్య చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త నిల్వ కోసం షెడ్ల నిర్మాణం చేపట్టినా అవి వినియోగంలోకి రావడం లేదు. మండలంలో షెడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం దాదాపు రూ.50 లక్షల వరకు ఖర్చు పెట్టినా వీటి ద్వారా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఆదాయం రాకపోవడం గమనార్హం. మరోవైపు ఈ షెడ్లను నిరుపయోగంగా వదిలేశారు. సేకరించిన చెత్తను వృథాగా పారవేస్తూ లక్ష్యానికి గండి కొడుతున్నారు. ఉన్నతస్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షణతో పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులతో పనులు చేపడితే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

పర్యవేక్షణ లోపంతోనే..

మండల స్థాయిలో పర్యవేక్షణ లోపం కారణంగా ఎరువు తయారీపై స్థానిక సిబ్బంది దృష్టి పెట్టడం లేదు. కంపోస్టు విభాగంలో కొంత ఎరువు పోసి దాన్నే నెలలుగా చూపిస్తున్నారు. ఇంతవరకు వర్మి కంపోస్టు తీసిన దాఖలాలు లేవు. నిజానికి కంపోస్టును గ్రామంలో విక్రయించి ఆదాయాన్ని సమకూర్చుకోవాలనేది ప్రభుత్వ లక్ష్యం. తయారీ జరుగుతుందని నివేదికలు పంపడం తప్పా ఆచరణలో ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీనికితోడు సేకరించిన తడి, పొడి చెత్తను ఒకే దగ్గర కుప్పలా పడేస్తుండడంతో షెడ్లు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో చెత్తను కాల్చేస్తుండడం గమనార్హం.

నిర్వహణ సక్రమంగా లేక..

పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్లను సమకూర్చింది. నిత్యం గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు వీటి ద్వారా తరలించాల్సి ఉంటుంది. ఆయా గ్రామాల్లో వ్యర్థాలను విభజించే పనులు జరగడం లేదు. తడి, పొడి చెత్తను కుప్పగా ఒకేచోట పడేస్తుండడంతో షెడ్‌లో వేర్వేరు అవసరాల కోసం నిర్మించిన స్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. పొడి చెత్తలో లభించే ప్లాస్టిక్, గాజు, ఇనుము, ఇతరత్రా సామగ్రిని విభాగాల వారీగా వేరుచేయడం లేదు. ఒక్క కేంద్రానికి రూ.2లక్షలకు పైగా ఖర్చు చేసినా నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. జిల్లాలోని ఏ పంచాయతీలోనూ సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. చాలా చోట్ల చెత్తను డంపింగ్ యార్డులో పోసి నిప్పు పెడుతున్నారు.

వీధుల్లోనే చెత్తాచెదారం..

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో రోడ్ల పక్కన, వీధుల్లోనే చెత్తా చెదారం దర్శనమిస్తుంది. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో అవగాహన కల్పించకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. పంచాయతీల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను షెడ్ వద్ద తడి చెత్త, ఇతర వ్యర్థాలను కంపోస్టు ఎరువు తయారీకి వినియోగించాలి. ఆ ఎరువును హరితహారం మొక్కలకు వినియోగించాలి. మిగిలిన వాటిని రైతులకు విక్రయించాలి. దీంతో పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. ఈ విషయమై బెజ్జూర్ ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్‌ను వివరణ కోరగా.. తడి చెత్త, పొడి చెత్త సేకరణ కార్యక్రమం ప్రతిరోజు ప్రతీ గ్రామపంచాయతీలో కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా కాలభైరవ అష్టమి వేడుకలు


కాలభైరవ స్వామి సన్నిధిలో భక్తులు


పూజలో పాల్గొన్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయ ఆవరణలో ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో శనివారం కాలభైరవ అష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాలభైరవ జయంతి సందర్భంగా స్వామి వారి దర్శనం కోసం జిల్లాలోని వివిధ గ్రామాలతో పాటు పక్క జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో కాలభైరవుడి దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. మినపగారెలు, పూలు, పండ్లు, మిఠాయిలు నైవేద్యాలుగా సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం కాళీ కాల భైరవ హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్, అధ్యక్షుడు తిరుపతిగౌడ్, భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

బీజేపీ నాయకుల సంబరాలు


ఆసిఫాబాద్‌అర్బన్: స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీజేపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు అరిగెల మల్లిఖార్జున్, ఖాండ్రె విశాల్, సెర్ల మురళి, సత్యనారాయణ, జయరాజ్, కోట వెంకన్న, ప్రసాద్‌గౌడ్, వెంకన్న, మహిళా నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మహారాష్ట్రలో బీజేపీ విజయదుందుభి మోగించడంతో శనివారం బెజ్జూర్ బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండలకేంద్రంలో టపాసులు పేల్చారు. నాయకులు ఉమ్మెర బాలకృష్ణ, దిగంబర్, సామల తిరుపతి, రాజారాం, ఉమ్మెరి తిరుపతి, రాకేశ్, శ్యాంసుందర్, బిక్షపతి, కిషన్ గోపాల్, వసిఉల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో శనివారం మండల కేంద్రంతో పాటు గోలేటిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాచకొండ రాజయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఓదెలు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.


బెజ్జూర్: టపాసులు పేల్చుతున్న బీజేపీ నాయకులు


రెబ్బెనలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ఘనంగా సత్యసాయి జయంతి

ఆసిఫాబాద్‌అర్బన్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతిని శనివారం జిల్లా కేంద్రంలోని గుండి రహదారి సమీపాన గల సత్యసాయి సేవాసదన్‌లో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకొని సేవాసదనంలో ఉదయం 5గంటలకు ఓంకారం, నగర సంకీర్తన, 6.30 గంటలకు ప్రశాంతి పతావిష్కరణ, 6.45 గంట లకు స్వామివారికి అష్టోత్తర శతనామావళి పా రాయణం, 7గంటలకు సాయి గాయత్రీ హోమం, 6 గంటల నుంచి 6.30 గంటల వరకు 98 దీపాలచే అలంకరణ, 6.30 నుంచి 7గంటల వరకు రుద్ర పారాయణం, మధ్యాహ్నం 1 గంట నుంచి 3గంటల వరకు అన్నదానవితరణ చేపట్టారు. రాత్రి 6 గంటల నుంచి 8 గంటల వరకు భజనా కార్యక్రమఅనంతరం ప్రసాద వితరణ చేపట్టారు.

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్, తాటిపల్లి, ముత్తంపేట్ గ్రామాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పల్లకి ఊరేగించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భజన కార్యక్రమం నిర్వహించారు. మొగడ్‌దగడ్ గ్రామంలోని శ్రీ జగన్నాథ్ ఆలయంలో మహా చండీయాగం నిర్వహించారు. అనంతరం ఆలయంలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు బొమ్మకంటి మనీష్, మణిరాం, దిలీప్, అనిల్, బాజీరావు, మహేశ్, వానుపటేల్, భూషణ్, సునీల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ లైన్‌లలో మరమ్మతుల పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు పట్టణంలోని వివేకానంద చౌక్, బస్టాండ్ నుంచి కేబీచౌక్ వరకు, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, గాంధీచౌక్, మేన్‌రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీరాజ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

యోగాతోనే ఆరోగ్యం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న సభ్యులు

కౌటాల: యోగానే ఆరోగ్యంగా ఉంటారని ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎం.సందీప్ అన్నారు. శనివారం మండలంలోని గురుడుపేటలో ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఈ సెంటర్‌లో యోగా తరగతులు నిర్వహిస్తారన్నారు. ప్రతి ఒక్కరు యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఉచిత యోగా తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు దాసరి వినోద్, ఎం.రోజా, సభ్యులు శ్రీనివాస్, మల్లగౌడ్, మెర్పల్లి బ్రహ్మయ్య, తిరుపతిగౌడ్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: బోథ్ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని టెంబి గ్రామపంచాయతీ పరిధిలోని చినుమియతండా గ్రామంలో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దాలు గడిచిన బోథ్ నియోజకవర్గంలో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా లేదన్నారు. వచ్చే నాలుగేళ్లలో ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అనంతరం రాజులగూడ, రతన్‌గూడ, హర్కాయి గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు.

స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి

నేరడిగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రోత్సాహకాలతో అభివృద్ధి చెందాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్లను అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ..

ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. శనివారం నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. రాజురా గ్రామానికి చెందిన దయానంద్‌కు రూ.60వేలు, బోథ్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన ఓస దీపికకు రూ.14వేలు, హారికకు రూ.19,500, దేవ్‌రావుకు రూ.19,500 చెక్కులు పంపిణీ చేశారు.

పరామర్శ..

ఇచ్చోడ: మండలంలోని బోరిగామ గ్రామంలో శనివారం గుడురు రాజేశ్వర్ రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పరామర్శించారు. నాలుగు రోజుల కిత్రం రాజేశ్వర్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సర్ఫారాజ్ అన్నారు. శనివారం మండలంలోని పిప్పల్‌ధరి సబ్ సెంటర్ పరిధిలోని అసోదా, బొప్పాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ ఇంజక్షన్లు ఇచ్చారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తినాలని సూచించారు. సిబ్బంది ముయ్యాల మోతి, పవర్ ప్రేంసింగ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

బోథ్: మండలంలోని మర్లపెల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 106 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, ఇద్దరు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం విద్యార్థులకు రక్త నమూనాలను సేకరించారు. హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె వైద్యాధికారి వీణా సాగర్, ఆప్తాల్మిక్ అధికారి భాస్కర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మండ్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ విరాళం

నేరడిగొండ: సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ అజయ్‌రెడ్డి తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా తేజాపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు శనివారం కంప్యూటర్‌ను విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, పాఠశాల అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. పాఠశాలలో ప్రతియేటా విద్యావలంటీర్ల నియామకంతో పాటు స్కావెంజర్ కోసం లక్షల రూపాయలు గ్రామాభివృద్ధి కమిటీ ద్వారా అందించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం పాఠశాల యాజమాన్యం కంప్యూటర్ అందజేసిన దాతను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ మంజూరు చేయాలి

తాంసి: కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు కొత్త పింఛన్ మంజూరు చేయాలని దివ్యాంగుల కమిటీ మండల అధ్యక్షుడు పొచ్చన్న డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పింఛన్‌ను గత జనవరి నుంచి అమలు చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. సతీష్, తోకల సత్యనారాయణ, ఆశన్న, గంగారం, పర్దానా పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న మల్లేశ్ దంపతులు

రెబ్బెన: గంగాపూర్‌లోని ప్రసిద్ధ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాదవేణి మల్లేశ్ దంపతులు భక్తులకు అన్నవితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జెడ్పీటీసీ పల్లె ప్రకాశ్‌రావు, ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్‌రావు, నాయకులు దుర్గం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.